



# కలవరమాయె మదిలో!

## -కె.కె.భాగ్యశ్రీ

డాబామీద నిలబడి చుట్టూ పచ్చని ప్రకృతిని పరిశీలిస్తున్న ప్రశాంత్ హఠాత్తుగా పక్క మేడమీదకి చూసి ఉలిక్కిపడ్డాడు.

కారణం ఆ మేడ మీద పడుచు.

ఇంతసేపూ ఆమెని గమనించనందుకు తనను తానే తిట్టుకున్నాడు.

ఆమె ముఖం చంద్రబింబంలా వుంది. ముతకరకం వాయిల్ చీరలో కూడా ఆమె సౌందర్యం చమక్‌మని మెరుస్తోంది.

పైట నడుం చుట్టూ తిప్పి కొంగు బొడ్లో దోపుకుంది. అందుచేత నడుం తాలూకు ఒంపు కనిపిస్తోంది. ఆమె నడుం ఒంపు చూసి ప్రశాంత్‌కి మతిపోయింది.

''వాటే బ్యూటీ!'' అనుకున్నాడు అప్రయత్నంగా.

అంత అందమైన స్ట్రక్చర్ ఏ మోడల్‌కీ ఉండదు. ఆమెని రకరకాల మోడ్రన్ డ్రస్‌లలో ఊహించుకున్న ప్రశాంత్ మనసు ఒక్కక్షణం ఆనందడోలికలూగింది.

''సౌజన్యా! ఎంతసేపే ఆరిన బట్టలు తీయడం'' క్రింద నుంచి తారాస్థాయిలో వినబడిన కేకతో ఆమె మెట్లవైపుగా వస్తుండడం గమనించిన ప్రశాంత్ గబగబా పిట్టగోడ దగ్గరగా వచ్చాడు.

ఒక్కక్షణం తలెత్తి అతన్ని చూసి తత్తరపడి మెట్లు దిగి ఇంట్లోకి వెళ్లిపోయింది ఆమె.

తియ్యని స్వప్నం చెల్లాచెదురయినట్లుగా బాధపడ్డాడు ప్రశాంత్.

ఆమె శరీరంలో సొంపులేకాదు ప్రశాంత్‌ని ఆకట్టుకున్నది పేరుకు తగినట్టుగానే ఆమె ముఖంలో ఉట్టిపడే సౌజన్యం, అమాయకత్వం తొణికిసలాడే ఆమె నయనాలు మొదలైనవన్నీ అతని మనస్సు మీద చెరగని ముద్ర వేసాయి.

ప్రశాంత్ మరీ నవలా నాయకునిలా వుండడుకానీ ఈ కాలపు అమ్మాయిలు కోరుకునే విధంగా స్టైల్‌గా, చార్మింగ్‌గా ఉంటాడు.

దానికి తోడు ముంబాయిలో మంచి ఉద్యోగం. తల్లిదండ్రులకు ఒక్కడే మగ సంతానం కావడం అతనికి ప్లస్ పాయింట్స్.

తన హోదా చూసి ఎందరో అమ్మాయిల తల్లిదండ్రులు పిల్లనిస్తామని అతని వెనుక తిరిగినా అతని మనస్సును మెచ్చిన అమ్మాయి ఇంతవరకూ తారసపడలేదు.

కానీ ఎందుకో...ఎందుకో ఈ వన్నెలాడి అతని మనోఫలకంమీద చెరగని చిత్తరువయి కూర్చుంది.

క్రిందకి దిగివచ్చి వరండాలో కూర్చునివున్న బావగారు సుందర్రావు దగ్గరికి వచ్చాడు ప్రశాంత్.


సుందర్‌రావు ప్రశాంత్ అక్క మొగుడు.

కొలీగ్ పెళ్లికని హైదరాబాద్ వచ్చిన ప్రశాంత్ అక్కడి నుండి అక్క, బావగార్లని చూడడానికని ఈ ఊరు వచ్చాడు. చిన్నప్పటి నుండి అక్క సుజాత దగ్గర అతనికెంతో చనువు.

''ఆ! ఏమిటి బామ్మర్దీ సైట్ సీయింగ్ పూర్తయిందా?'' ప్రశ్నించాడు సుందరరావు అతన్ని.


''ఆ!'' పరధ్యానంగా సమాధానం చెప్పిన ప్రశాంత్‌ని ఆశ్చర్యంగా చూసాడు.

''ఏంటి



ప్రశాంత్! అన్యమనస్కంగా ఉన్నావు. ఎనీ ప్రాబ్లమ్!'' అనునయంగా అడిగాడు అతన్ని సుందరరావు.

''ఏంలేదు బావా! ఇందాక పక్కింటి మేడ మీద ఒక మెరుపుతీగను చూసాను. ఎందుకో తెలియదుగానీ ఆమె రూపం నా గుండెల్లో తిష్ట వేసుకుని కూర్చుంది. చూసింది ఒక్కసారే అయినా పెళ్లంటూ చేసుకుంటే ఆమెనే చేసుకోవాలని అనిపిస్తోంది. ఇంతకీ ఆమె ఎవరు బావా?'' ప్రశ్నించాడు ప్రశాంత్ తన మనసులో సంగతిని బయట పెడుతూ.




''ఓహో! అదా సంగతి! లవ్ ఎట్ ఫస్ట్ సైటన్న మాట. సౌజన్య గురించా నువ్వు అడుగుతున్నది? పక్కింట్లో ఉన్నారులే రామారావుగారని ఆయన మరదలు ఈ అమ్మాయి. అంటే ఆయన భార్యకు చెల్లెలన్న మాట. ఇంక ఆమెనే పెళ్లి చేసుకుందామన్న నీ ఐడియా బాగానే వుందిగానీ, ఆచరణలో చాలా కష్టం...''

''ఎందుకు బావా కష్టం? ఆ అమ్మాయికేదైనా జబ్బా? లేక ఇదివరకే పెళ్ళయిపోయిందా?'' ఆదుర్దాగా అడిగాడు ప్రశాంత్ సస్పెన్స్ భరించలేక.

''ఛ...ఛ...అలాంటిదేమీలేదు. ఎందుకో వాళ్లక్కయ్యకి ఆమె పెళ్లి ప్రసక్తి తేవడం ఇష్టముండదు. నిన్ను దృష్టిలో పెట్టుకుని మీ అక్కయ్య ఒకటి రెండుసార్లు ఆమెతో పెళ్లి ప్రస్తావన తెచ్చిందిగానీ రుక్మిణిగారు ఏం మాట్లాడకుండా విషయం దాటవేసింది ఎందుకో ఏమో?'' బావమరిది సందేహాన్ని తీరుస్తూ తన సందేహం వెలిబుచ్చాడు సుందర్రావు.

''ఎందుకేంటి...ఆ అమ్మాయికి పెళ్లి చేసి పంపేస్తే రుక్మిణిగారికి జీతం, బత్తెంలేని పనిమనిషి మళ్లీ దొరకదని... చెల్లెలు అనైయినా చూడకుండా ఇంటెడు చాకిరీ చేయించడమే కాక ఆమెను గట్టిగా మాట్లాడనివ్వదు. మనసారా నవ్వనివ్వదు. ఇంక ఆ అమ్మాయికి బట్టలుంటాయి చూడు అంత నాసిరకంవి కూలివాళ్లు కూడా కట్టుకోరు. అయినా ఏం బట్టలు కట్టుకుంటేనేం మట్టిలో మాణిక్యంలా సౌజన్య మెరిసిపోతూ వుంటుంది. అన్ని విధాలా ఆమెని కష్టపెట్టినా, ఎవరన్నా నోరు మెదపదు. అంత సహనం ఆమెకు ఎలా అబ్బిందో!'' అంది అప్పుడే అక్కడికి వచ్చిన ప్రశాంత్ అక్కయ్య సుజాత.

''అక్కయ్యా! ఎలాగైనా నాకు ఆ పిల్లనే పెళ్లి చేసుకోవాలని వుంది'' సిగ్గుపడుతూ చెప్పాడు ప్రశాంత్.

''లాభం లేదురా! రుక్మిణిగారు అంత తొందరగా ఒప్పుకునే మనిషికాదు. అయినా అడిగి చూద్దాం'' అంది సుజాత.

★★★

రుక్మిణి సౌజన్యని అంత హీనంగా చూడడానికి కారణం ఆమెకి సౌజన్య సవితి చెల్లెలు. రుక్మిణికి పన్నెండేళ్లు వచ్చేసరికి ఆమె తల్లి చనిపోతే తండ్రి రాఘవరావు రెండో పెళ్లి చేసుకున్నాడు. ముప్పై ఏళ్లొచ్చినా పెళ్లికాని పేదింటి పిల్ల అనసూయ మీద జాలితో ఆమెను వివాహమాడాడు.

తండ్రి మరో పెళ్లి చేసుకున్నాక తల్లివైపు బంధువులు కలసి రుక్మిణి మనసులో సవితితల్లిపై విషబీజాలు నాటారు.

అనసూయ చాలా అందగత్తె, సహనశీలి. రుక్మిణి ఎంత పేచీలు పెట్టినా ఆమె సర్దుకుపోయేది.

అనసూయమీద అసలే అగ్గిమీద గుగ్గిలమవుతున్న తరుణంలో ఆమె ఒక పాపకు జన్మనిచ్చింది. ఆ పిల్లే సౌజన్య.

తల్లి నుండి ఆమెకు సంక్రమించిన ఆస్తి, ఆమె అద్భుత సౌందర్యం.

అపురూప లావణ్యవతి అయిన చెల్లెల్ని చూసి రుక్మిణి మనసు ఇంకా మండిపడింది.

కారణం రుక్మిణిది సాధారణమైన అందం. చామనఛాయతో వయసు తెచ్చిన పొంగులు తప్ప మరో ఆకర్షణ ఏమీలేని సామాన్య రూపం ఆమెది.

దానికితోడు అందరూ 'రాఘవయ్యగారి పెద్దకూతురుకన్నా చిన్న కూతురు మంచి అందగత్తె. పున్నమి వెన్నెల లాంటి రూపం' అని పొగిడేవారు.

వీటన్నింటి వలన రుక్మిణి మనసులో సౌజన్య అంటే అయిష్టం, ద్వేషం ఏర్పడిపోయింది ఆమెకు తెలియకుండానే.

18 ఏళ్లు రాగానే దూరపు బంధువు, అనాధ అయిన రామారావుకి రుక్మిణిని ఇచ్చి పెళ్లిచేసి అతన్ని ఇల్లరికం అల్లుడిగా తెచ్చుకున్నాడు రాఘవయ్య.

ఆ తరువాత కొన్నిరోజులకే ఏదో పేరు తెలియని వ్యాధి సోకి మరలిరాని లోకాలకి తరలిపోయింది అనసూయ.

అప్పటికే వయస్సుమీద పడిన రాఘవరావు మంచంలో తీసుకుని తీసుకుని అనసూయను వెతుక్కుంటూ తానూ వెళ్లిపోయాడు.

పోతూ పోతూ తన యావదాస్తినీ కూతుళ్లిద్దరి పేరా రాశాడు. సౌజన్య అప్పటికి చిన్నపిల్ల కాబట్టి సౌజన్యకి యుక్త వయస్సువచ్చి ఆమెకు పెళ్లయేవరకూ ఆమె ఆస్తికి రుక్మిణిని గార్డియన్‌గా నియమించాడు.

ఆమెను పెంచి పెద్దచేసే బాధ్యతను స్వీకరిస్తామని రుక్మిణి, ఆమె భర్త చేత ప్రమాణం చేయించుకుని మరీ కన్నుమూశాడు.

చావు బ్రతుకుల మధ్యనున్న తండ్రి ఆఖరి కోరికను కాదనే సాహసం చేయలేకపోయింది. అందుకే ఇష్టం లేకున్నా చెల్లెలి బాధ్యతను స్వీకరించక తప్పలేదామెకు.

అది మొదలు సౌజన్యమీద అంతర్గతంగా వున్న కక్ష తీర్చుకునేదామె తన చర్యలద్వారా. ఒక పనిమనిషికన్నా అధ్వాన్నంగా ఆమెను ట్రీట్ చేయడం మొదలుపెట్టింది.

మంచి బట్టలు ఇస్తే ఆమె అందం ఎక్కడ ద్విగుణీకృతమవుతుందోనని ముతకవి, గాడీగా పెద్ద డిజైన్లున్న చీరలు ఆమెకు కొనిచ్చేది.

కానీ వజ్రాన్ని గుప్పిట్లో మూసినా దాని కాంతిని దాచగలమా?

అలాగే ఎంత చవకరకం బట్టలయినా సౌజన్య ఒంటిని తాకగానే వాటికే అందం చేకూరేది.

రుక్మిణి భర్త రామారావుకి మాత్రం సౌజన్య అంటే తగని జాలి.

ఆమధ్య నుండి భార్యను హెచ్చరించడం మొదలుపెట్టాడు.

''సౌజన్యకు పద్ధెనిమిది నిండిపోయాయి. త్వరగా ఆమెకి పెళ్లిచేసి ఆమె ఆస్తి ఆమెకు అప్పగిస్తే బాధ్యత తీరిపోతుంది'' అని. కానీ రుక్మిణి అతని మాటలు పెడచెవిన పెట్టింది.

చూస్తుండగానే సౌజన్యకి ఇరవై ఏళ్లు నిండిపోయాయి. తల్లిదండ్రులు చనిపోయిన దగ్గర్నుండీ అక్కే తన మంచి చెడ్డలు చూస్తోందన్న ఉద్దేశ్యంతో ఆస్తిని గురించిగానీ, తన పెళ్లి గురించిగానీ అక్కయ్యతో ఏమీ చర్చించేదికాదు. దైవ నిర్ణయం ఎలా వుంటే అలాగే జరుగుతుందని భగవంతునిపై భారంవేసి మిన్నకుండిపోయేది సౌజన్య.

ప్రశాంత్ తనను ఇష్టపడ్డ సంగతి కూడా సుజాత ద్వారా తెలుసుకుంది సౌజన్య.

## A జోక్స్

### పేమ్ పేమ్

''మరీ ఇంత చిన్న పిల్ల మనస్తత్వం వున్న అమ్మాయిని నాకిచ్చి కట్టబెట్టి నా గొంతు కోస్తారనుకోలేదు...'' శోభనం గదిలోంచి బయటికొచ్చి గొల్లుమన్నాడు పెళ్లి కొడుకు.

''ఏం బాబూ ఏమైంది?'' కంగారుగా అడిగారంతా.

''ఏమయిందీ..రాత్రంతా పేమ్ పేమ్ పప్పీ షేమ్ అని మీ అమ్మాయి కళ్లు మూసుకోవడంతోనే తెల్లారిపోయింది'' మళ్లీ బావురుమన్నాడా పెళ్లి కొడుకు.

-సూర్యచంద్ర (తుని)

★★★

### ఎంజాయ్

''ఏమోయ్ రాంబాబూ ఫస్ట్‌నైట్ బాగా ఎంజాయ్ చేసినట్టున్నావు. నిద్రలేక కళ్లు బాగా ఉబ్బాయి'' నవ్వుతూ అడిగాడు భుజంగం.

''దోమ తెరలో నా పెళ్లాం గురక, బయటకొస్తే దోమలతో చురక..నిద్ర పోతే ఒట్టు'' డీలాగా చెప్పాడు రాంబాబు.

- భువన(పేరెచర్ల)

‘‘మా అక్కయ్యతో మాట్లాడండి. ఆమెదే ఆఖరి నిర్ణయం’’ అని మృదువుగా చెప్పిం దామె.

‘‘రుక్మిణిగారూ! మా ప్రశాంత్ మీ సౌజన్యంటే చాలా ఇష్టం కనబరుస్తున్నాడు. ఈడు జోడు కూడా బావుంటుంది. ఏమంటారు?’’ అడిగింది సుజాత రుక్మిణిని.

ఆ ప్రసక్తి తేవడమే ఆమెకిష్టంలేనట్టు ముఖం ముటముటలాడిస్తూ ‘‘దాని పెళ్లికి ఇప్పుడిప్పుడే తొందరలేదు సుజాతగారూ. ఇంకా మొన్ననేగా పద్ధెనిమిది నిండి పందొమ్మిది వచ్చింది. ఇంకా చాలా టైముందిలెండి’’ అని విషయాన్ని తేలిగ్గా కొట్టి పారేసింది.

అసలు ఉద్దేశ్యం వేరే వుంది రుక్మిణికి. ఏనాటికైనా సౌజన్యకి పెళ్లి చేయడం తప్పనిసరి అని ఆమెకు తెలుసు. కానీ ప్రశాంత్ అంతటి మంచి యువకుడు, అందగాడు తనకుతానుగా కోరి సౌజన్యను వరించడం ఆమె భరించలేకపోతోంది. చెల్లెలి రూప లావణ్యాలకు, మంచితనానికి అంత గుర్తింపు రావడం ఆమె సహించలేకపోతోంది. తమ చేతుల్లో పడుండే మనిషిని సౌజన్యకు కట్టబెడితే తద్వారా ఆమె ఆస్తిని అంతా తామే అనుభవిస్తూ జీవితాంతం పనిమనిషిని వెతుక్కోనక్కర్లేదని ఆమె ఉద్దేశ్యం.

‘‘ఒరేయ్ ప్రశాంత్! నా దృష్టిలో ఇంక నువ్వు సౌజన్యను మరచిపోయి నీకు నచ్చిన ఇంకో అమ్మాయిని పెళ్లి చేసుకోవడం బెస్ట్’’ తేల్చేసింది సుజాత.

‘‘లేదక్కయ్యా! నిజంగానే ఆమె నాకు దక్కని పక్షంలో ఆజన్మాంతం బ్రహ్మచారిగానే మిగిలిపోతాను’’ ప్రతిజ్ఞ చేసాడు ప్రశాంత్.

‘‘చెప్తే వినిపించుకోవుకదా. అది జరగని పని. నువ్విలా బెండకాయలా ముదిరిపోవడం తప్పించి వేరే ప్రయోజనం ఉండదు’’ అంది సుజాత నిట్టూరుస్తూ.

‘‘ఏదో విధంగా సౌజన్యను దక్కించుకోవాలి’’ పరిపరి విధాలుగా సాగుతున్నాయి అతని ఆలోచనలు.

‘‘ఏదో చేయాలి! ఏమైనా చేయాలి?’’ స్థిరచిత్తుడయ్యాడతను.

★★★

ఆ రోజు సాయంత్రం ఆఫీస్‌నుండి రుక్మిణిని పిలిచి ఓ పాకెట్ ఆమె చేతికిచ్చాడు రామారావు. అందులో రెండు ఖరీదైన చీరలున్నాయి. ఒకటి లేత గంధపు రంగుది. ఆ కలర్ రుక్మిణి శరీరానికి నప్పుతుంది.

ఇంకొకటి మెజెంటా కలర్‌మీద జరీ వర్క్‌తో మిలమిల మెరిసిపోతోంది.

ఆ చీర చూసి రుక్మిణి నుదురు చిట్లించింది.

‘‘నేనిలాంటి డార్క్ కలర్స్ కట్టనని మీకు తెలుసుకదా! మరి ఇదెందుకు తెచ్చారు?’’ ప్రశ్నించింది భర్తను ఆమె.


‘‘అది నీకు కాదు’’ రామారావు సమాధానం.

‘‘మరి...?’’ అర్థం కానట్టు చూసింది రుక్మిణి.

‘‘అది...అది...సౌజన్యకి.’’

అదిరిపడింది రుక్మిణి.

‘‘ఇంత మంచి చీర దానికా?’’




‘‘పెళ్లి కావాల్సిన పిల్లకదా. సౌజన్య ఒంటి ఛాయకి ఆ రంగైతే బావుంటుందని తెచ్చాను. సౌజన్య బంగారు రంగు శరీరం మీద అందంగా అమరిపోతుందీ శారీ...’’ రామారావు చెప్పాడు.

ఎన్నడూ భర్త నోట రానటువంటి మాటలు విన్న రుక్మిణికి ఏదో అపశృతి ధ్వనించింది అతని మాటలలో. ఎప్పుడూ తన అనుమతి లేకుండా ఏ పని చేయని భర్త ఇవాళ ఈ విధంగా ప్రవర్తించడం ఆమెను కలవరపెట్టింది.

‘‘పనీ పాటా చేసుకుని పడుండేది. దానికెందుకండీ ఇంత ఖరీదైన చీర? తిరిగిచ్చేసి మామూలు చీర తీసుకు రండి’’ హుకుం జారీ చేసింది రుక్మిణి.

‘‘ఎంత ఖరీదైన చీరయినా ఆమెకేం ఊరికే కొనివ్వక్కరలేదుకదా. ఆమె సొమ్ముతోనే ఆమెకు ఈ శారీ తెచ్చాను. అంతే...’’ అంటూ సౌజన్యను కేకేసి ఆ చీరను దానితోపాటు మ్యాచింగ్ రెడీమేడ్ బ్లౌజ్‌ను ఇచ్చాడు రామారావు.

‘‘వెంటనే కట్టుకునిరా...’’ అన్నాడు రామారావు.

ఆ చీరను చూసి ఎంతో పొంగిపోయింది సౌజన్య. చిన్నపిల్లలాగా సంబరపడింది.

‘‘ఎంతో బాగుంది బావా. ఉండు ఇప్పుడే కట్టుకుని వస్తాను.’’

‘‘అసలు దాని జాకెట్టు కొలతలు ఎలా తెలిసింది ఈయనకు? ఒకవేళ దాన్నడిగి జాకెట్ ఆదికి తీసుకెళ్లారా? లేక ఇంకేమన్నా?’’ రుక్మిణి గుండె గుభిల్లుమంది ఆ ఊహకి.

సౌజన్య చీరను అందంగా కట్టుకుని వచ్చి నిలబడింది. రామారావు కాళ్లకి నమస్కరించింది.

‘‘మార్వలెస్ సౌజన్యా! నీ ఒంటికి ఈ రంగు చాలా అందంగా నప్పింది.’’

రామారావు పొగడ్తకు కారం రాసుకున్నట్లుగా వుంది రుక్మిణికి.

నిజంగానే సౌజన్య అద్భుతంగా వుందా చీరలో. రెడీమేడ్ బ్లౌజ్ కాబట్టి ఆమె శరీరానికి అతికినట్లుగా సరిపోయింది. ఎన్నడూ తన ఆజ్ఞను జవదాటని భర్త తన చెల్లెలికో కానుక తేవడం, ఆమె అందచందాల్ని పొగడ్డం... ఇవన్నీ రుక్మిణిలో ఏదో అసూయ, అనుమానాలను రేకెత్తించాయి.

కసిగా చెల్లెల్ని ఓ చూపు చూసి లోపలకు వెళ్లిపోయింది రుక్మిణి మరేం చేయలేనట్లు. అంతా చూస్తున్న రామారావు గుంభనంగా నవ్వుకున్నాడు.

ఇంకోరోజు స్నానం చేసి వచ్చి బట్టలు వేసుకుంటూ అద్దం ముందు నిలబడి తన అందాలు పరిశీలించుకుంటోంది సౌజన్య.

‘ఏమిటో ఎప్పుడూ ఇలాంటి స్థితిలో చూడలేదు సౌజన్యని తను. ఇవాళ ఏం వెర్రెత్తిందో ఏం పాడో. ఎప్పుడూ తడిఓంటిమీదే బాత్‌రూంలోనే ఆదరాబాదరగా గుడ్డలు చుట్టబెట్టుకుని వస్తుందికదా! ఏమయింది దీనికివాళ?’ అని తనలో తానే అనుకుంటూ ‘‘ఏమిటే! ఏం చేస్తున్నావు. ఏమిటా పని?’’ గద్దించింది చెల్లెల్ని రుక్మిణి.

‘‘మరి...మరి.. బావేమో!’’ నసుగుతోంది సౌజన్య.

‘‘చెప్పు... బావ? బావేంటి?’’ ఆదుర్దాగా అడిగింది రుక్మిణి.

‘‘మరి...బావ...నా తొడలు ఫలానా సిన్మా యాక్టర్ తొడల్లాగా, అరటిబోదెల్లాగా నున్నగా ఉన్నాయని అంటుంటాడు. నిజమో కాదో తెలుసుకుందామని...’’

సౌజన్య సమాధానం విని ప్రాన్పడిపోయింది రుక్మిణి. ఆమె గుండెల్లో అగ్ని పర్వతాలు ప్రేలినంత విస్ఫోటనం. చైతన్య రహితంగా నిలబడిపోయింది కాస్సేపు.

తేరుకుని అద్దంలో తనని తాను చూసుకుంది రుక్మిణి.

బాగా లావెక్కి కండలు జారినట్లున్న తన శరీరం అసలు ఒంపులేమన్నా శరీరంలో ఒకప్పుడైనా వుండేవా అన్నట్లు కలసిపోయినట్లున్న శరీరపు ఆకృతి.

రుక్మిణికేదో మెల్లగా అర్థం అవుతోంది. తనిప్పుడు అందవిహీనం అయింది కాబట్టి ఇంట్లోనే అందాలు వెదజల్లుతున్న తన చెల్లెల్ని చేరదీస్తున్నాడు భర్త.

ఆ ఆలోచన రాగానే ఉలిక్కిపడింది రుక్మిణి.

తను చెల్లెలిని బానిసలాగా ఉపయోగించుకుంటున్నాననే మురిసిపోతోందిగానీ తన గుండెలమీద నిప్పుల కుంపటిలా ఆమెను భరిస్తున్నానని గ్రహించలేకపోయింది.

ఆ రాత్రంతా కంటిమీద కునుకు లేదు రుక్మిణికి. తన భర్తను చెల్లెలు తన నుండి లాక్కుపోతోందన్న ఫీలింగ్ ఆమెలో.

ఒక్క రాత్రికే పది లంఖణాలు చేసినట్లు ఆమె ముఖం వాడిపోయింది. కళ్లకింద చారలు ఏర్పడ్డాయి.

మర్నాడు తనకు ఎంతో క్లోజ్‌గా వుండే పొరుగింటి పిన్నిగారి దగ్గర తన గోడు వెళ్లబోసుకుంది మనసులో మదన పడలేక.

‘‘అంతా నీ స్వయంకృతమేనమ్మా. మీ ఆయనకీ పరిస్థితిని నువ్వే కల్పించావు’’ అంది రుక్మిణి చెప్పినదంతా విని ఆమె.

నిర్ఘాంతపోయింది రుక్మిణి ఆవిడ మాటలకి.

‘‘ఏమిటి మీరనేది?’’ అరచినట్లే అంది దాదాపుగా.

‘‘నిజమేనమ్మా! వయసొచ్చిన పిల్లను ఇంకా ఇంట్లో వుంచుకుని నువ్వే మీ ఆయన మతి చెడగొట్టావు!’’

‘‘కానీ...కానీ సౌజన్య ఆయన కళ్లముందు పెరిగిన పిల్ల...’’

‘‘అవుననుకో. అప్పుడు చిన్నపిల్ల. ఇప్పుడు అందాల భరిణె. ఎంతటి మగవాడికయినా అంత అందగత్తె ఇంట్లో

తిరుగుతుంటే మనసు చలించదూ. పైగా ఇంకా పెళ్లికాని పిల్ల. ఆస్తి కోసమని నువ్వాలోచిస్తున్నావుగానీ నీ జీవితాన్ని నువ్వు కోల్పోతున్న సంగతి నువ్వు గ్రహించలేదు. ఇప్పటికైనా మించిపోయింది ఏమీలేదు. త్వరగా ఆ పిల్లకి ఏదో ఒక సంబంధం చూసి ముడి పెట్టేయ్. ఎంతయినా ఆమెకీ కోరికలుంటాయికదా! అవి తీరే మార్గం దొరుకుతుంది. నీ భర్త నీకు దక్కుతాడు కూడా'' అని హితోపదేశం చేసింది పిన్నిగారు.

అంతే!

రుక్మిణి, రామారావులిద్దరూ సుజాత, సుందరరావులతో మంతనాలాడ్డం, వాళ్లు ప్రశాంత్ తల్లిదండ్రులకు కబురు చేయడం, నిశ్చయ తాంబూలాలు ఇచ్చి పుచ్చుకోవడం చకచకా జరిగిపోయాయి.

కాబోయే కోడలిని చూసి ప్రశాంత్ తల్లి ఎంతో మురిసిపోయింది. శ్రీమహాలక్ష్మిలా వున్నావంటూ అక్కున చేర్చుకుంది. సౌజన్య మనసు ఆమె ఆదరణకి ఎంతో పొంగిపోయింది.

ఇంకో నెలలోనే బ్రహ్మాండంగా పెళ్లి జరిగిపోయింది.

ఆ రాత్రే వారి తొలి రాత్రి.

ఇంట్లో శోభనానికి ఏర్పాట్లు చేస్తుంటే వద్దని వారించాడు ప్రశాంత్. ఫైవ్‌స్టార్ హోటల్‌లో తానొక రూమ్ బుక్ చేశానని, ఏర్పాట్లన్నీ హోటల్ వారే చూసుకుంటారని చెప్పాడు.

ఈ మాటలు చెప్తూ కొంటెగా కన్నుగీటిన అతడిని చూసి ఎర్రగా కందిపోయింది ఆమె మోము మందారంలా. తొలి సిగ్గు మొగ్గలు వేసిందామెలో.

అందంగా అలంకరించిన ఎయిర్ కండిషన్డ్ గదిలో అంతకన్నా అందంగా తయారైన వారిద్దరూ పూలపక్కమీద, ఏనాడూ సూర్యుడు కూడా చూడని తన కన్నె పరువాలు, అంతెందుకు తనని తానే పరికించి చూసుకోని తన యవ్వన సిరులన్నీ అతను కొల్లగొడుతుంటే ఆమె ఎంతో ఇష్టంగా సహకరించింది. మూడు జన్మలకి సరిపోయిన అనుభవాల్ని సొంతం చేసుకున్నారా యువ జంట మూడు రాత్రులూ.


''ఇంక లీవ్‌లేదు. నేను సౌజన్యని తీసుకుని ముంబాయి వెళ్లిపోతాను'' అన్నాడు ప్రశాంత్ - రామారావు, రుక్మిణిలతో.

''అలాగే ప్రశాంత్. మీ ఇద్దరికీ ఇంక ఎడబాటు వుండకూడదు. ఆ... అన్నట్లు మీరీసారి వచ్చేసరికి ఆస్తి మీ పేర మార్పించి వుంచుతాను. ఏమంటావు సౌజన్యా!'' అడిగాడు మెని రామారావు.

సమాధానం చెప్పకుండా మౌనంగా వుండిపోయింది సౌజన్య.

''దొంగ మీసుగ! నా మొగుడిని వలలో వేసుకుందామనుకుంది. నేను పడనిస్తానా దీని ఎత్తులు?'' గర్వంగా అనుకుంది రుక్మిణి.

ఆ మర్నాడే ప్రశాంత్, సౌజన్యల ప్రయాణం. సుజాత, సుందరరావు, రామారావు వాళ్లకి వీడ్కోలు చెప్పడానికి స్టేషన్‌కి వెళ్లారు. రుక్మిణి మాత్రం తలనొప్పి సాకు చెప్పి తప్పించుకుంది. ఆటో ఎక్కేముందు అక్కయ్య కాళ్లకి నమస్కరించింది సౌజన్య. కసిగా ఆమెనో చూపు చూసి లోపలికి వెళ్లిపోయింది రుక్మిణి.




మనసులో కాస్త బాధనిపించినా గుండె దిటవు చేసుకుని ఆటో ఎక్కింది.

''వెధవ ఆస్తి పోతే పోయింది. ఆయన నాకు దక్కారు అంతేచాలు'' అనుకుంది రుక్మిణి తృప్తిగా.

మరో పదిహేనురోజులు గడిచిపోయాక రుక్మిణి పేర ఓ లెటర్ వచ్చింది. అది సౌజన్య రాసిన లేఖ. విప్పి చదవడం మొదలెట్టింది రుక్మిణి.

''మహాలక్ష్మి సమానురాలైన అక్కయ్యకి''

మొదలు చదివి ధుమధుమలాడుతూ అనుకుంది రుక్మిణి ''ఈ నక్క వినయాలకేం లోటులేదు'' తిరిగి లెటర్ చదవడం మొదలుపెట్టింది.

''ఇక్కడ నేనూ ప్రశాంత్ క్షేమంగానే ఉన్నాము. భగవంతుని దయవలన మా కాపురం చక్కగా సాగుతోంది. ప్రశాంత్‌కి నేనంటే విపరీతమైన ప్రేమ. నాకు లెక్కలేనన్ని చీరలు, నైటీలు, చుడీదార్లు అన్నీ కొనిచ్చాడు. నేనంటే ప్రాణం...''

ఒక్కక్షణం ఈర్ష్య పడింది రుక్మిణి.

''నీకు నామీద పీకలదాకా కోపం వుందని తెలుసు. అసలు చిన్నప్పటి నుండీ నామీద విపరీతమైన ద్వేషం పెంచుకున్నావు. దానికి కారణం నా అందం అని కూడా తెలుసు. అందంగా పుట్టడం నా నేరమా అక్కయ్యా!

ప్రశాంత్ నన్ను తొలి చూపులోనే ప్రేమించాడు. వాళ్లక్కయ్య గౌరవంగా నిన్ను పెళ్లికి ఒప్పిద్దామనుకుంటే నువ్వు కానివ్వలేదు. అందుకే ఈవిధంగా నాటకమాడాల్సి వచ్చింది.''

''నాటకమా?'' ఉలిక్కిపడి తిరిగి ఉత్తరంవైపు దృష్టి సారించింది.

''ఈ నాటకానికి సూత్రధారుడు ప్రశాంత్ అయితే నేనూ బావ పాత్రధారులం. అసలు బావ నీకెన్నటికీ ఈ విషయం తెలియనివ్వద్దన్నాడు. కానీ దేవుడిలాంటి బావ నీ దృష్టిలో ఒక దోషిగా మిగిలిపోవడం ఇష్టం లేక నేనే ఈ ఉత్తరం రాస్తున్నాను.

నువ్వు నా పెళ్లి చేయడానికి ఎంతకీ ఒప్పుకోకపోవడంతో మేమీ నాటకం ఆడాల్సి వచ్చింది. ప్రశాంత్, బావకీ విషయం చెప్పి మాకు సహకరించమని ప్రాధేయపడ్డంతో బావ ఇందుకు అంగీకరించాడు. నువ్వెవర్ని చూపెడితే వాళ్ళే కట్టుకోవాలని నేను ఎప్పుడో నిర్ణయించుకున్నాను. కానీ ఎందుకో ప్రశాంత్ నన్ను సూదంటు రాయిలా ఆకట్టుకున్నాడు. అతని కోసం నేను ఆరాటపడ్డం నీ దృష్టిలో పెద్ద నేరం. కానీ నాకూ కోరికలనేవి వుంటాయికదా! అందుకే ఈ నాటకం ఆడాం. నాకు బావకి నువ్వనుకుంటున్న సంబంధం మాత్రం లేదు.

నువ్వు బావమీద ఎంత అధికారం చెలాయించినా అంతకు రెట్టింపు ప్రేమ బావమీద నీకుందని నాకు తెలుసు. అందుకే కీలెరిగి వాత పెట్టమన్నట్లుగా నీ వీక్ పాయింట్‌ని ఆధారంగా చేసుకుని నీకీ షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వవలసి వచ్చింది. ఏ స్త్రీ అయినా ఏ పోరు అయినా భరిస్తుందికానీ సవతి పోరుకి మాత్రం ఒప్పుకోదు. ఆ సూత్రం ఆధారంగా మేము ఈ నాటకం ఆడాము. నీ మనస్సు నొప్పిస్తే క్షమించు.

తల్లిలా చిన్నప్పటి నుంచి నన్ను పెంచావు. తల్లి పిల్లల్ని దండించదా ఏదైనా తప్పు చేస్తే. అంత మాత్రాన తల్లికి పిల్లల మీద ప్రేమ లేనట్టేనా! అందుకే నువ్వెన్ని విధాల నన్ను హింసించినా నేను పట్టించుకోలేదు. నువ్వు నాకు తల్లివైతే బావ నాకేమవుతాడక్కా! ఆలోచించు. కన్నతండ్రితో సమానం కదా!

నా అవసరార్థం బావమీద నింద మోపవలసి వచ్చింది. క్షమించు. కానీ అన్నేళ్లు కాపురం చేసిన నువ్వు కూడా బావని అర్థం చేసుకున్నది ఇంతేనా?

ప్రతి మగవాడు మొదట అందచందాలను చూసి పెళ్లి చేసుకుంటాడు. కానీ తరువాత కలసి సంసారం చేస్తే భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలకే ఎక్కువ చోటు వుంటుంది. పెళ్లయిన పదేళ్ల తరువాత భార్య అందం కోల్పోయిందని భర్త ఇంకో ఆడదాన్ని చేరదీస్తే ఈ దేశంలో ప్రతి మగాడికి ఓ చిన్నిల్లు వుండేది. కానీ అందరు మగవాళ్లు అలా ఆలోచించరక్కా! బావ కూడా నిన్ను మనసారా ప్రేమిస్తున్నాడక్కా. అసలు ఈ విధంగా నాటకమాడి నిన్ను కష్టపెట్టవలసి వచ్చినందుకు బావెంతో బాధపడ్డాడు. అతని మనసు తెలుసుకుని అతనికి అనుగుణంగా నడుచుకో ఇకనైనా నువ్వు.

ఎక్కడ బావ నీకు కాకుండా పోతాడేమోనన్న భయంతో నా పెళ్లి నన్ను కోరుకున్న వ్యక్తికిచ్చి జరిపించావు. అందుకు నీకు జన్మజన్మలకు రుణపడి వుంటాను. ప్రశాంత్‌లాంటి మంచి వ్యక్తికి నేను భార్యనవడం నాకు చాలా ఆనందకరం. ఇక ఆస్తి అంటావా? దానిమీద నాకేనాడూ ఆశలేదు. దానిని నీ పేరు మీదే ఉండనీయక్కా. ఎప్పుడైనా పుట్టింటికి...అదే నీ ఇంటికి వస్తే చిటికెడు పసుపు కుంకుమ, పిడికెడు ఆప్యాయతానురాగాలు నాకు పంచి ఇవ్వగలవా అక్కా! అవే నాకు నువ్విచ్చే ఆస్తిపాస్తులు. పితృ సమానుడైన బావని ఈ నాటకంలో పావుగా ఉపయోగించుకున్నందుకు చాలా బాధపడుతున్నాను. బావకి నా నమస్కారములతోపాటు క్షమాపణలు కూడా అందజెయి. ఆరోజు బావ నాకు తెచ్చిచ్చిన చీర ప్రశాంత్ తన ప్రేమ కానుకగా మా నాటకంలో భాగంగా పంపారు. అది నిజంగా బావ కొనలేదు.

ఇట్లు

నీ చెల్లెలు

సౌజన్య

★